

వేములవాడలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న చల్మెడ సతీమణి సునీల

# అభివృద్ధితో కలిసి నడుద్దాం

- చల్మెడ లక్ష్మీనరసింహారావును ఎమ్మెల్యేగా గెలిపించాలి
- మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, చల్మెడ సతీమణి సునీల
- చల్మెడకు మద్దతుగా ప్రచారం

వేములవాడ, నవంబర్ 11: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కలిసి నడుద్దామని వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి అన్నారు. శనివారం పట్టణంలోని 14, 15 వార్డులలో చల్మెడ సతీమణి సునీలతో కలిసి ఆమె ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం మాధవి మాట్లాడారు. ప్రతీ సంక్షేమ పథకంలో మహిళలకే ప్రాధాన్యమిస్తూ, అభివృద్ధి, సంక్షేమాన్ని సమాన స్థాయిలో అందించిన సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేద్దామని పిలుపునిచ్చారు. వేములవాడ అభివృద్ధియే ధ్యేయంగా మన ముందుకు వస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావును కూడా ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో కౌన్సిలర్లు జడల లక్ష్మి, గూడూరు లక్ష్మి, నిమ్మశెట్టి విజయ్, నాయకులు రామతీర్థపు రాజు, గూడూరు మధు, అంజద్ పాషా తదితరులు ఉన్నారు.

# రామన్నకు మద్దతునివ్వండి

- బీసీ సంక్షేమ సంఘం నాయకులతో తోట ఆగయ్య

సిరిసిల్ల, నవంబర్ 11: సిరిసిల్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి కేటీఆర్‌కు మద్దతునిచ్చి, భారీ మెజార్టీ అందించాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు, బీసీ సంక్షేమ సంఘం నాయకులతో ఆగయ్య సమావేశమై, మాట్లాడారు. సిరిసిల్లలో జరిగిన చారిత్రాత్మక అభివృద్ధితోపాటు బీసీల సంక్షేమానికి కృషి చేసిన అమాత్యుడు రామన్నకు అండగా ఉండాలన్నారు. సిరిసిల్ల నియోజకవర్గ ముఖచిత్రాన్ని మార్చిన ఘనత కేటీఆర్‌దేనన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న రామన్నను భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. హన్మాండ్లు మాట్లాడుతూ, తన విజ్ఞప్తి మేరకు సిరిసిల్లలో బీసీ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేసిన మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. త్వరలో జిల్లా, మండల స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసుకుంటామన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు తడక కమలాకర్, రవీందర్, కంచర్ల రాజు, కందుకూరి రామాగౌడ్, అనిల్, కంచర్ల రవిగౌడ్, తిరుపతి, కైలాష్, అన్నారం రవీందర్, బోయిన శ్రీనివాస్, సురేశ్, శ్రీనివాస్, శ్రీధర్ పాల్గొన్నారు.



పర్శ హన్మాండ్లు, బీసీ సంక్షేమ సంఘం నాయకులతో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

# ఎంసీఎంసీ ఉల్లంఘనలపై అప్రమత్తంగా ఉండాలి

- అసెంబ్లీ ఎన్నికల సాధారణ పరిశీలకుడు డా.జగదీష్ సోన్‌కర్

కలెక్టరేట్, నవంబర్ 11: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అక్రమ నగదు, మద్యం జప్తు, అభ్యర్థుల ఎన్నికల ఖర్చు వివరాలు, 1950 టోల్‌ఫ్రీ నెంబర్, సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులు, సామాజిక మాధ్యమాల్లో గమనించే ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు మొదలగు నివేదికలను ప్రతి రోజు సకాలంలో సమర్పించాలని రాజన్న సిరిసిల్ల అసెంబ్లీ ఎన్నికల సాధారణ పరిశీలకుడు డాక్టర్ జగదీష్ సోన్‌కర్ అన్నారు. శనివారం సిరిసిల్ల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్నికల సమీకృత ఫిర్యాదులు-పర్యవేక్షణ కేంద్రాన్ని కలెక్టర్ అనురాగ్ జయంతితో కలిసి పరిశీలించారు. ఎన్నికల సమీకృత జిల్లా ఫిర్యాదుల కేంద్రంలో జీవీఎస్ మానిటరింగ్, 1950 కాల్ సెంటర్, కంట్రోల్ రూమ్, సీ-విజిల్, ఎంసీఎంసీ, సోషల్ మీడియా విభాగాల పనితీరును కలెక్టర్ అనురాగ్ జయంతి ఎన్నికల పరిశీలకులకు వివరించారు. ఫిర్యాదుల కేంద్రం పనితీరు పట్ల డా.జగదీష్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ ఎన్.భీమ్యానాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి మామిండ్ల దశరథం, జిల్లా చేనేత జౌళి అధికారి సాగర్ ఉన్నారు. అంతకుముందు డా.జగదీష్‌సోన్‌కర్ సిరిసిల్ల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించి ఎన్నికల రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించారు.

### ఎలాంటి ఫిర్యాదులున్నా తెలియజేయండి

జిల్లాలో పార్టీలు, అభ్యర్థుల ఎన్నికలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా తనకు తెలియజేయాలని జగదీష్‌సోన్‌కర్ కోరారు. ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా సిరిసిల్లలోని పంచాయతీరాజ్ గెస్ట్‌హౌజ్‌కు ముందస్తు సమాచారంతో వచ్చి తనను కలిసి నేరుగా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. లేదా మొబైల్ నెంబర్ 89771 23147, ల్యాండ్ లైన్ నెంబర్ 08723-227022కు ఫోన్ చేసి చెప్పవచ్చని ఆయన సూచించారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రం ఆగమే

- కేసీఆర్ చేతుల్లో ఉంటేనే తెలంగాణ భద్రం
- మూడోసారి సీఎంగా కేసీఆర్‌ను చేసుకుంటరు
- వంద స్థానాల్లో బీఆర్‌ఎస్సే గెలుస్తుంది
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

సిరిసిల్ల టౌన్, నవంబర్ 11: కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే రాష్ట్రం ఆగం అవుతుందని, కుక్కలు చింపిన విస్తరిలా తయారవుతుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న సమయంలో సరైన నాయకుడికి అధికారం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. పైసలు నోటుపోతే తిరిగి సంపాదించుకోవచ్చని, ఓటు పోతే తిరిగి సంపాదించుకోలేమని, ఆలోచించి పనిచేసే వాళ్లకే ఓటు వేయాలని సూచించారు. కేసీఆర్ చేతుల్లో ఉంటేనే తెలంగాణ భద్రంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారని, మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. గతంలో బీఆర్‌ఎస్‌కు 80కిపైగా స్థానాలు వచ్చాయని, ఈ సారి వంద స్థానాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మూడోసారి జరుగుతున్న ఈ ఎన్నికలు చాలా ప్రాముఖ్యం కలిగినవని చెప్పారు. రాష్ట్రాన్ని సాధించిన పార్టీ బీఆర్‌ఎస్ అని స్పష్టం చేశారు. సాధించిన రాష్ట్రాన్ని తర్వాత రెండుసార్లు జరిగిన ఎన్నికల్లో ప్రజలందరూ కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ పార్టీకి అధికారం ఇచ్చారన్నారు. ప్రస్తుతం మూడో సారి జరుగుతున్న ఎన్నికల్లో మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమీ లేదని మండిపడారు. గోదావరిపై ఎస్సారెస్పీ మాత్రమే కట్టిందని, ఎల్‌ఎండీ మినహాయిస్తే ఒక్క రిజర్వాయర్ నిర్మాణం చేపట్టలేదన్నారు. కేసీఆర్ నాయకత్వంలో కాళేశ్వరం ప్రాజెక్టుతోపాటు మూడు బ్యారేజీలు, 20రిజర్వాయర్లు నిర్మించారని, దూరదృష్టి ఉన్న నాయకుడు ఉంటే ఇలాంటి అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మూడు మెడికల్ కాలేజీలు ఉంటే, అందులో రెండు స్వాతంత్రం రాకముందు ఏర్పడినవేనన్నారు. కాంగ్రెస్ ఏర్పాటు చేసింది రెండే రెండు మెడికల్ కాలేజీలు అని తెలిపారు. కేసీఆర్ హయాంలో 35మెడికల్ కాలేజీలు నిర్మించగా, మారుమూల పట్టణాల్లోనూ 500 పడకల దవాఖానలు, మల్టీస్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చారన్నారు. నాటి కాంగ్రెస్ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి తెలంగాణ వస్తే కరెంట్ తీగలపై బట్టలు ఆరేసుకుంటరు, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటారని శాపనార్థాలు పెట్టారని గుర్తు చేశారు. నేడు రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి 3 గంటల కరెంట్ సరిపోతుందని అంటున్నాడని, కాంగ్రెస్‌కు ఓటేస్తే రాత్రివేళ టార్చిలైట్ పట్టుకొని తిరగాల్సి వస్తుందేమోనన్నారు. అభివృద్ధిపై కనీసం ఆలోచన లేని నాయకులు కాంగ్రెస్ పార్టీ వారన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కేసీఆర్ విదేశీ విద్యానిధి పథకం ద్వారా విదేశాల్లో చదువుకునే వారికి ప్రోత్సాహం అందిస్తున్నట్లు చెప్పారు. బీజేపీ పాలిస్తున్న రాష్ట్రాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలిత కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో రైతుబంధు, రైతుబీమా ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని మోదీ, అమిత్‌షా, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, లక్ష్మణ్ అంటున్నారని.. బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటేనని, అందుకే కవిత అరెస్ట్ కాలేదని కాంగ్రెస్‌వాళ్లు అంటున్నారన్నారు. ఏ కుర్చీలో అయితే కవితను విచారణ చేశారో.. అక్కడే సోనియాగాంధీ, రాహుల్‌గాంధీని సైతం విచారణ చేశారని, వారిని అరెస్ట్ చేయలేదన్నారు. మరీ నేను కాంగ్రెస్, బీజేపీ ఒకటే.. అని అంటున్నానా.. అని అన్నారు. కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు విశ్వసించడం లేదన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ ఒజ్జల అగ్గిరాములు పాల్గొన్నారు.

# అభివృద్ధి ప్రదాతపై అడ్డగోలు వ్యాఖ్యలా?

- బండి సంజయ్ విమర్శలు అర్థరహితం
- సిరిసిల్లకు బీజేపీ ఏం చేసిందో చెప్పాలి
- టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, అన్నల్‌దాస్ వేణు

సిరిసిల్ల టౌన్, నవంబర్ 11: సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మంత్రి కేటీఆర్‌పై బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్ అసందర్భ వ్యాఖ్యలు చేశారని టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ మండిపడ్డారు. ఈమేరకు శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి నామినేషన్ సందర్భంగా సిరిసిల్ల అభివృద్ధి గురించి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. స్థానికంగా జరిగిన అభివృద్ధిని తెలుసుకోవాలంటే ఒక రోజు మొత్తం పర్యటించిన సమయం సరిపోదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక ఐటీ కంపెనీలు, ఐటీ హబ్‌లు ఏర్పాటు చేసిన ఘనత కేటీఆర్‌కే దక్కుతుందన్నారు. బతుకమ్మ చీరలు ఆర్డర్లు ఇచ్చింది సిరిసిల్ల నేతన్నల ఉపాధి కొరకు మాత్రమే అని, రాజకీయ ఉద్దేశంతో కాదని సీఎం కేసీఆర్ స్వయంగా ప్రకటించారన్నారు. సిరిసిల్లలోని రెండో బైపాస్ రోడ్డు, వర్కర్ టు ఓనర్ షెడ్లు 50వరకు పూర్తి అయ్యాయని తెలిపారు. అదే ప్రాంతంలో మెడికల్ కళాశాల అందుబాటులోకి వచ్చిందని, అగ్రహారంలో ఇంజనీరింగ్ కళాశాల నడుస్తుందన్నారు. రూ.16 కోట్లతో కొత్త చెరువును సుందరీకరించారని, మినీ స్టేడియాన్ని అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. సిరిసిల్లలో ఎంపీ ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు వచ్చాయని చెప్పుకుంటున్న బండి సంజయ్ గడిచిన నాలుగేండ్లలో సిరిసిల్ల అభివృద్ధికి ఏం నిధులు తెచ్చారో చెప్పాలని నిలదీశారు. రాష్ట్రానికి మెడికల్ కళాశాల ఇవ్వని మీరు మంత్రి కేటీఆర్‌పై విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. విమర్శలు మానుకొని రాబోయే రోజుల్లో సిరిసిల్లకు ఏం చేస్తారో ప్రకటించాలన్నారు. అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న కేటీఆర్ గురించి విమర్శలు చేయడం బండి సంజయ్ కుసంస్కారానికి నిదర్శనంగా భావిస్తున్నామన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ నాయకుడు అన్నల్‌దాస్ వేణు మాట్లాడారు. అభివృద్ధిని గమనించకుండా తెలివితేటలు ప్రదర్శిస్తే ప్రజలు ఓటు రూపంలో మీకు బుద్ధి చెబుతారని హితవు పలికారు. మరోసారి కేటీఆర్‌పై గానీ, సిరిసిల్లలో జరిగిన అభివృద్ధి గురించి గానీ మాట్లాడితే సహించేదిలేదని స్పష్టం చేశారు. సిరిసిల్ల రూపురేఖలు మార్చిన మంత్రి కేటీఆర్‌ను నియోజకవర్గ ప్రజలు భారీ మెజార్టీతో ఆశీర్వదిస్తారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బొల్లి రామ్మోహన్, మ్యాన రవి, సత్తార్, సబ్బని హరీశ్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# రసమయిని గెలిపించాలి



వంతడుపులలో కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఇల్లంతకుంట, నవంబర్ 11: తెలంగాణలో బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని వైస్ ఎంపీపీ సుదగోని శ్రీనాథ్‌గౌడ్ ఓటర్లను అభ్యర్థించారు. శనివారం మండలంలోని వంతడుపుల గ్రామంలో పార్టీ నాయకులు ఎమ్మెల్యేగా రసమయి బాలకిషన్‌ను గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాతనే అభివృద్ధి జరిగిందని వివరించారు. యాభై ఏండ్లుగా పరిపాలించిన కాంగ్రెస్ చేసిన అభివృద్ధి ఏమీ లేదని వాపోయారు. కారు గుర్తుకు ఓటేసి రసమయి బాలకిషన్‌ను మూడోసారి మానకొండూర్ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీ అందించి గెలిపించాలని కోరారు. ప్రచారంలో సర్పంచ్ కట్ట వెంకట్ రెడ్డి, వార్డుసభ్యులు నవీన్‌రెడ్డి, లచ్చయ్య, శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.